# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-09-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది.**

2. **వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పూర్తవడం, ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు చేరడం శుభపరిణామమని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.**

3. **వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ  నీటిని విడుదల చేస్తున్నామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.**

4. **అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఈ. లక్ష్మీరెడ్డి అధికారులను ఆదేశించారు.**

==========================

అమరావతి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. 20కి పైగా అజెండా అంశాలతో జరుగుతున్న ఈ సమావేశంలో సాగునీరు, అమరావతి, విద్యుత్ రంగాలకు సంబంధించిన అంశాలపై మంత్రి వర్గం చర్చించిస్తోంది.  అలాగే అమరావతి అభివృద్ధికి సంబంధించి రహదారి నిర్మాణ విధానంలో మార్పులు, రైల్వే అనుసంధానం, ఇన్నర్ రింగ్ రోడ్డు పనులకి ఆమోదం తెలిపే అవకాశం ఉందని, వివిధ సంస్థలకు భూ కేటాయింపుల అంశాలపైనా మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుందని అధికారులు తెలిపారు.

------------------------

వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పూర్తవడం, ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు చేరడం శుభపరిణామమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా విడుదల చేసిన వీడియో సందేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు రావడంతో దశాబ్దాల కల సాకారమైందని, రాష్ట్ర ప్రజలందరికీ  శుభాకాంక్షలు తెలిపారు. వెలిగొండ, భోగాపురం, అమరావతి వంటి  అభివృద్ధి కార్యక్రమాలు కార్యరూపం దాల్చడం ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి తెలియజేస్తూ,.

వాయిస్..30..  సెకన్లు

------------------------

విజయవాడ ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో 60 లక్షల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, స్థానిక శాసన సభ్యులు గద్దె రామ్మోహన్‌తో రేపు కలిసి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ , కళాశాల ఆవరణలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. సీసీ రోడ్లను అందుబాటులోకి తీసుకొచ్చామని, ప్రతిరోజూ సుమారు 5 వందల మంది ఓపీ సేవలు పొందుతున్నారని చెప్పారు. రోగుల కోసం నీటి శుద్ధి కేంద్రం, షెడ్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కేశినేని శివనాథ్ వెల్లడించారు.

--------------------------

చేనేత కార్మికులకు పెట్టుబడి భారం తగ్గించేందుకు నూలును సరఫరా చేస్తామని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'చేనేత ఉత్పత్తుల విక్రయాలను పెంచేందుకు ఆప్కో, లేపాక్షి షోరూమ్‌లలో పండుగల సందర్భంగా తగ్గింపు ధరల అమ్మకాలు నిర్వహించాలని సూచించారు. ఖాదీ గ్రామీణ పారిశ్రామిక అభివృద్ధి బోర్డు ద్వారా అందించే స్వయం ఉపాధి యూనిట్లపై గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని మంత్రి సవిత ఆదేశించారు.

--------------------------

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ నీటిని విడుదల చేస్తున్నామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాలలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం కొనసాగుతోందని, రైతులు వర్షాధార పంటల సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. ట్యాంకులను జలాశయాలను నింపి తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

--------------------------

అమరావతి ఆర్థిక ప్రాంతం -ఏఈఆర్ అభివృద్ధికి సంబంధించిన సమగ్ర ప్రణాళిక రూపకల్పనపై అమరావతిలోని ఏపీసీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో నిన్న కార్యశాల నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఈఆర్ పరిధిలోని తొమ్మిది జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా అధికారులు, రాష్ట్రంలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తొమ్మిది జిల్లాల ఆర్థిక పరిస్థితులు, ప్రత్యేకతలు, అభివృద్ధి అవకాశాలు, ప్రాధాన్యతలపై అధికారులు చర్చించారు.

అమరావతి ఆర్థిక ప్రాంతాన్ని తొమ్మిది వేర్వేరు జిల్లాలుగా కాకుండా, పరస్పరం అనుసంధానమైన ఒకే ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఏఈఆర్ సీఈఓ ఎస్. సురేష్ కుమార్ తెలిపారు. ప్రాంతీయ అవసరాలు, ఆర్థిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులు, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, రవాణా, లాజిస్టిక్స్, పెట్టుబడులపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆయన సూచించారు.

--------------------------

అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యత, పరిమాణం, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఈ. లక్ష్మీరెడ్డి అధికారులను ఆదేశించారు.

కృష్ణాజిల్ల  గుడ్లవల్లేరు, గుడివాడ, పామర్రు మండలాల్లో ఆయన ఈరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అంగలూరు అంగన్‌వాడీ కేంద్రంలో భౌతికంగా ఏడుగురు పిల్లలు మాత్రమే హాజరైనప్పటికీ, ఆన్‌లైన్‌లో తొమ్మిది మంది హాజరుగా నమోదు చేసినట్లు గుర్తించారు. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన పరిమాణంలో పౌష్టికఆహారంఅందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

-------------------------

గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దాములూరులో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన నూతన గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

..వాయిస్.. 25 సెకన్లు

-------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా ఉత్సవాల నిర్వహణపై ఆలయ పాలకమండలి సమావేశం ఈరోజు జరిగింది. బోర్డు ఛైర్మన్ బి.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దసరా ఉత్సవాల ఏర్పాట్లపై ప్రధానంగా చర్చించారు. ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి శీనా నాయక్ పాలకమండలి సభ్యులకు వివరించారు. దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా అక్టోబర్ 20వ తేదీ సాయంత్రం కృష్ణానదిలో హంసవాహన తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

-------------------------

గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి పరిష్కరించేందుకే 'పల్లె వీక్షణ' కార్యక్రమం నిర్వహిస్తున్నామని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. జిల్లాలోని సంగం మండలం మక్తాపురం గ్రామంలో అధికారులతో కలిసి ఆయన ఈరోజు పర్యటించి, వి.బి.జి.రాంజీ పథకం కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించే ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ధాన్యం నిల్వ చేసేందుకు గోదాము లేదని, రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో,  గోదాము నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

గుంటూరు జిల్లా మంగళగిరిలోని విద్యాభవన్ ఎదుట ఉపాధ్యాయులు ఈరోజు ఆందోళన చేపట్టారు. ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న ఇన్ సర్వీస్ టీచర్లకు  టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అర్హతను 40 శాతానికి పరిమితం చేయాలని కోరారు.

====================